క్లుప్తంగా

మహిళలకు మగ్గం వర్క్‌లో శిక్షణ



మెటీరియల్ అందజేస్తున్న చైర్మన్

రాజానగరం: పాత వెలుగుబందలో డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు సుమారు 70 మంది మహిళలు హాజరయ్యారు. శిక్షణకు అవసరమైన మెటీరియల్‌ను ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు అందజేశారు. నాతిపాము పద్మ, దుర్గ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

గాడాల విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందుకున్న గాడాల స్కూల్ విద్యార్థులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం లారెల్ హైగ్లోబల్ స్కూల్ యాజమాన్యం బహుమతులను అందజేసింది. లారెల్ స్కూల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. లారెల్ స్కూల్ ఉపాధ్యాయులు ఎండీ అమీరున్నీషా, అఖిల్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం నిర్మల జ్యోతి, ఉపాధ్యాయురాలు శిరీష కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ శ్రీపద్మ

పెదపూడి: రాజ్యాంగం కల్పించిన చట్టాలపై బాలికలు, మహిళలు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సంపర సెక్టార్ సూపర్ వైజర్ సీహెచ్ శ్రీపద్మ అన్నారు. సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా వంద రోజులు అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం త్రిమూర్తులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నత భావాలను అలవర్చుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు మహాలక్ష్మి

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, రెడ్‌క్రాస్, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్‌క్రాస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువు కోవడంతో పాటు సమాజానికి మేలు చేసే ఉన్నత భావాలను కలిగి ఉండటమే రెడ్‌క్రాస్ ముఖ్య ఉద్దేశమన్నారు. రాజమండ్రి రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు డాక్టర్ మహాలక్ష్మి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ చరిత్ర, దాని సేవ కార్యక్రమాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు మంచి పనులు చేయాలనే ఆలోచన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏడీబీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

రంగంపేట: ఏడీబీరోడ్డు అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో రోడ్డు అధ్వానంగా తయారైందని, దీంతో కాకినాడ, రాజమహేంద్రవరం మధ్య ప్రయాణం వాహనచోదకులకు నరకప్రాయంగా మారిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని ఎస్టీరాజాపురం, గోవిందరాజాపురం వద్ద ఏడీబీరోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను కోరామన్నారు. అనంతరం రంగంపేట-జి.దొంతమూరు, పెదరాయవరం-సింగంపల్లి రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పరిశీలించారు.

ఈ-క్రాప్ నమోదు లేనట్టేనా?

- పంట నమోదుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- రాయితీలు, నష్టపరిహారాలపై రైతుల ఆందోళన
- నియోజకవర్గంలో 75 శాతం వరినాట్లు పూర్తి
- 46,500 ఎకరాల్లో వరి సాగు



కైకవోలులో రైతుకు ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకుడు, చిత్రంలో ఏఓ మణిదీప్ (ఫైల్)

పెదపూడి: ఆరుగాలం శ్రమించే అన్నదాతకు ఉపయోగకరం ఉండే ఈ-క్రాప్ నమోదు ఇంకా ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన గురవుతున్నారు. ప్రభుత్వం అందించే రాయితీలు, నష్టపరిహాలు కోల్పోవలసిందేనని ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైంది. నాట్లు కూడా పూర్తి కానున్నాయి. ఇంకా ఈ-క్రాప్ నమోదు ఊసేలేదు. అసలు పంట నమోదు ఉందో లేదోనని అన్నదాతలు అనుకుంటున్నారు. ఏటా పంటల సాగు సమయంలో పొలాలకు వచ్చే వ్యవసాయ సిబ్బంది ఇప్పుడు కనిపించకపోవడంతో కలవరపడుతున్నారు. పంట నమోదుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పంట నమోదు కాకుంటే ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఇబ్బందులు తప్పవని బెంగపడుతున్నారు. దీనిపై స్థానికంగా ఉండే వ్యవసాయ సిబ్బందిని ఆరా తీస్తున్నారు. వారి వద్ద నుంచి కూడా సరైన సమాధానం రావడంలేదు. గత ప్రభుత్వ హయాంలో ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి భరోసా అందేదని, కొత్త ప్రభుత్వం కొలువుదీరి రోజులు గడుస్తున్నా పెట్టబడి సాయం అందే దారి కనిపించడంలేదంటూ ఆవేదన చెందుతున్నారు. అనపర్తి నియోజకవర్గంలో అనపర్తిలో 9,550 ఎకరాలు, బిక్కవోలులో 15,741, పెదపూడిలో 18,500, రంగంపేట మండలంలో 2,709 ఎకరాల్లో మొత్తం ఖరీఫ్ సీజన్‌లో 46,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో దాదాపు 75శాతం మేర వరినాట్లు, వేదసాగు విదానంలో నాట్లు ప్రక్రియ పూర్తయింది. అలాగే ప్రతి సీజన్‌లో అనపర్తిలో 9 వేలు, పెదపూడిలో 11 వేలు, బిక్కవోలులో 10,500, రంగంపేట మండలంలో 10 వేల మంది వరకు అన్నదాతలు ఈ-క్రాప్ నమోదు చేయించుకునేవారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకు ఈ-క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపచేసేది. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభమైన వెంటనే ఈ క్రాప్ నమోదు ప్రక్రియను ప్రారంభించేది. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ ప్రక్రియను నిర్వహించేవారు. పంట సాగు చేసిన రైతులను పొలం వద్ద నిలబెట్టి పంటతో పాటు ఫొటోలు తీసి యాప్‌లో వివరాలు నమోదు చేసేవారు. దీని ఆధారంగానే ఎరువులు, ఇతర సాగు సాయాన్ని వ్యవసాయ సిబ్బంది అందించేవారు. రైతులు పండించిన పంటను కూడా ఈ క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు చేసేది.

ప్రయోజనాలు

- పంటల బీమా వర్తిస్తుంది.
- పంట రుణాలు మంజూరవుతాయి
- ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం అందుతుంది.
- పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవచ్చు
- సున్నావడ్డీ అమలవుతుంది. ఎరువులు, పురుగుమందులు తక్కువధరలకే సరఫరా చేస్తారు.
- వైఎస్సార్ యంత్ర పరికరం నమోదు, పెట్టుబడి సాయం మంజూరు, ఉచిత బోర్లు మంజూరు మొదలగునవి అందుతాయి.

మార్గదర్శకాలు రాలేదు

ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంతవరకు గైడ్‌లైన్స్ రాలేదు. వచ్చిన తర్వాత వాటి ఆధారంగా పంట నమోదుకు చర్యలు తీసుకుంటాం. రైతులకు అనుకులంగా అన్ని ఏర్పాట్లు చేస్తాం. ఇబ్బంది పడొద్దు.

–టీవీఆర్ మణిదీప్, వ్యవసాయశాఖాధికారి పెదపూడి

డిజిటల్ టెక్నాలజీ సక్రమంగా వినియోగించాలి

బిక్కవోలు: డిజిటల్ టెక్నాలజీ సక్రమంగా వినియోగిస్తే ఉజ్వల భవిష్యత్తు అని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొణాల సత్తిరాజు అన్నారు. శుక్రవారం పాఠశాలలో డిజిటల్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన ప్రాక్టికల్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. సత్తి రాజు మాట్లాడుతూ టెక్నాలజీతో మంచి మార్గాలకు వినియోగించుకోవాలన్నారు. అనంతరం టి.జయకృష్ణారెడ్డి, శ్యామ్ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో వివిధ డిజిటల్ మోడల్స్ ప్రదర్శించి వివరించారు. ఈ కార్యక్రమంలోని హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పీడి యువరాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి



ఏపీత్రయం పాఠశాలలో విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

పెదపూడి: పాఠశాలల్లో విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపర్చాలని విద్యాశాఖ పాఠశాల ఆర్‌జేడీ నాగమణి అన్నారు. ఏపీత్రయం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు రికార్డులు పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో సబ్జెక్టులు వారీగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థుల సమాధానాలతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రోత్సహాకాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ, హెచ్‌ఎం రాజు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరులకు నివాళి

రాజానగరం: కలవచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన అమర వీరులకు నివాళులర్పించారు. బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ అడబాల గణపతిరావు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

రాజానగరం: రాజమహేంద్రవరంలోని డెల్టా ఆస్పత్రి సహకారంతో స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు కార్డియో పుల్మనరీ రీసస్టియేషన్ (సీపీఆర్)పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్ గురించి, దాని ఎవ్వరికి, ఎప్పుడు చేయాలో ఎండీ డాక్టర్ కె.నాగేశ్వరరావు వివరించారు. ప్రమాదానికి గురైన మనిషి స్పృహ కోల్పోతే, ఆ సమయంలో అందించాల్సిన ప్రాథమిక చికిత్సపై అవగాహన కలిగించారు. డాక్టర్ నితిన్ మాట్లాడుతూ ఇన్నోవేషన్ సర్జికల్ టెక్నాలజీలో వచ్చిన ఆధునిక పోకడలను, వెరికోస్ (ఉబ్బిన సిరలు) లక్షణాలు, చికిత్స పద్ధతులను తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రన్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి



రంగంపేట తహసీల్దార్ లతీఫ్‌పాషాకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ సభ్యులు

రంగంపేట: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరారు. శుక్రవారం వారు మండలంలోని తహసీల్దార్ లతీఫ్‌పాషా, ఎంపీడీఓ వెంకటరత్నం, విద్యాశాఖాధికారి శ్రీనివాసరావులను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న విద్యారంగ సంస్కరణ ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు విశ్వాసం సడలిపోతుందన్నారు. వివిధ మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని, పెరిగిన పనిభారంతో పాటు సమస్యలు పరిష్కారంకాక అసంతృప్తి తీవ్ర స్థాయిలో ఉందన్నారు. అన్నింటికి తగిన పరిష్కారం చూపాలని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల అధికారులకు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపస్‌రావు, జిల్లా మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు విజయగౌరీ, మండల అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి విజయబాబు, కోశాధికారి కె. శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, శంకర్, తాతాజీ, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత కచ్చితంగా పాటించాలి



కరకుదురులో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కార్యదర్శి ప్రసన్నకుమార్



పెదరాయవరంలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న కార్మికులు

పెదపూడి: గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రత కచ్చితంగా అందరూ పాటించాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి అన్నారు. మండలంలో కరకుదురు, పుట్టకొండ, కైకవోలు, గండ్రేడు తదితర గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి డెంగీ, మలేరియా, టైఫాయిడ్, మొదలగు వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సర్పంచులు వల్లు వెంకటరమణ, వుంద్రు చంద్రకళ, నూని పట్టాభిరామన్న చౌదరి, కుడిపూడి మాధవీలత, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుంద్రు సత్యనాఆరయణ, కార్యదర్శులు ప్రసన్నకుమార్, కొండలరావు, శిరీష, తరుణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో దోమల నివారణ

రంగంపేట: పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ జరుగుతుందని గ్రామ సర్పంచ్ పెంటా సుజాత అన్నారు. శుక్రవారం స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా దోమల నివారణ, పరిశుభ్రత కోసం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పారిశుద్య పనులను పర్యవేక్షించి మాట్లాడారు. గ్రామంలోని ప్రతీ వీధిలోను దోమల మందు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కామేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

చురుకుగా కుష్ఠువ్యాధి నిర్ధారణ సర్వే



మిర్తిపాడులో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో కుష్ఠువ్యాధి నిర్ధారణ సర్వే నిర్వహించారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ కార్యక్రమం భాగంగా జరిపిన ఈ సర్వేలో 130 మంది అనుమానితులను గుర్తించారు. వారికి వైద్య పరీక్షలు జరపగా వారిలో ఇద్దరికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. వారికి ఇంటి వద్దే ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ మండలంలో 36,792 మందిని సర్వే చేసినట్టు తెలిపారు. ఒంటిపై ఏ విధమైన మచ్చలు ఉన్నా ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలన్నారు.

క్రమేపీ తగ్గుతున్న గోదావరి వరద



ములకల్లంకలో పర్యటిస్తున్న తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు



బొబ్బిల్లంక - ములకల్లంక గ్రామాల మధ్య బోటుపై ప్రజల రాకపోకలు

సీతానగరం: గోదావరి వరద వల్ల ఏమైనా సమస్యలు ఏర్పడితే వెంటనే తెలియజేయాలని ములకల్లంక వాసులను తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు కోరారు. ఆయన శుక్రవారం ములకల్లంకలో పర్యటించారు. స్థానికులను కలుసుకుని, ఏమైన సమస్యలు ఉంటే తెలియపర్చాలని కోరారు. గ్రామస్తులు బదులిస్తూ వరద తగ్గుముఖం పట్టడంతో ఎటువంటి సమస్య లేదన్నారు. కాగా.. గోదావరి వరద నెమ్మదిగా తగ్గుతూ వస్తోంది. ములకల్లంకలోని ప్రతి వీధిలోనూ పారిశుధ్య కార్మికులు బ్లీచింగ్ వెదజల్లారు. వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బొబ్బిల్లంక రేవులోనూ, ములకల్లంక గ్రామంలో వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయి. గ్రామంలో ఇళ్ల వద్ద ఉన్న వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. గ్రామస్తులు బోటుపై ప్రయాణం యథాతథంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు.



బొబ్బిల్లంకలో కొనసాగుతున్న వైద్యశిబిరం

బంగారు రూపులకు రిజిస్ట్రేషన్

మధురపూడి: స్థానిక హరే రామ సమాజం ప్రాంగణంలో శుక్రవారం బంగారు వరలక్ష్మి రూపులకు సంబంధించి రిజిస్ట్రేషన్ నిర్వహించారు. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మంటపంలో ఈ నెల 31వ తేదీన లక్కీడ్రా తీసి బంగారు రూపులు అందజేయనున్నారు.

ఏటిగట్టు పటిష్టతకు కృషి

సీతానగరం: ఏటిగట్టు పటిష్టతకు కృషి చేస్తామని అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్ ఏఈ శివప్రసాద్ అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ సీతానగరం మండలం బొబ్బిల్లంక, జాలిమూడి గ్రామాల మధ్యలోనూ, అలాగే అశోక్ నగర్ వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉందన్నారు. గోదావరి వరద కారణంగా అక్కడ కోతకు గురవుతుందన్నారు. దానికోసం రాళ్లు, ఇసుక బస్తాలను సిద్ధం చేశామన్నారు. కాగా.. ఏజీఎల్‌బీ అధికారులు శుక్రవారం రాత్రి ఏటిగట్టును పరిశీలించారు. శనివారం రాళ్ల డంపింగ్ చేపడతామని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

రాజమహేంద్రవరం సిటీ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అతి వేగం ప్రమాదకరమని, నిబంధనలను ఉల్లంగించిన ఎవ్వరూ వాహనాలు నడపరాదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలన్నారు. రైల్వేస్టేషన్ అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రయాణికులను చైతన్య పరిచారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అభిరామ్, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ సి.విశ్వనాథ్, పారాలీగల్ వలంటీర్లు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

అటు చదువుతూ.. ఇటు గెలుస్తూ..

- చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం
- సత్తా చాటుతున్న నగర క్రీడాకారులు
- పలు టోర్నీలలో పతకాల కైవసం



రోప్ స్కిప్పింగ్‌లో వెండి పతకం సాధించిన యామినీదేవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్



ఇండో నేపాల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన నాగపండు

ప్రకాశం నగర్: చదువులో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు దూసుకుపోతున్నారు. వివిధ పోటీలలో పాల్గొని తమ సత్తా చాటుతున్నారు. అనేక పతకాలు సాధించి, మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా నగరంలోని ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు విద్యార్థులు ఈ ఘనత సాధించి శభాష్ అనిపించుకుంటున్నారు. సాధారణ క్రీడలతో పాటు కరాటే, రోప్ స్కిప్పింగ్ తదితర వాటిల్లో ప్రతిభ చూపుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో పతకాలు సాధించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికపై రాజమహేంద్రవరం ఖ్యాతిని పెంచుతున్నారు. ఇటీవల జరిగిన ఇండో నేపాల్ కరాటే చాంపియన్ షిప్ – 2024 పోటీల్లో దేశం తరఫున కరాటేలో 60 కేజీల అండర్ -22 విభాగంలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన బి.నాగపండు బంగారు పతకం సాధించాడు. బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న అతడు పలు విభాగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాడు.

రోప్ స్కిప్పింగ్‌లో వెండి పతకం

భోపాల్‌లో ఇటీవల నిర్వహించిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో కందుకూరి రాజ్యలక్ష్మి స్త్రీల కళాశాల విద్యార్థిని ఎ.యామినీ దేవి ప్రతిభ చూపి వెండి పతకం సాధించింది. భీమవరం డీఎన్ఆర్ కాలేజీలో నిర్వహించిన ఇంటర్ కొలాజియేట్ రోప్ స్కిప్పింగ్ సింగిల్ టచ్ పోటీల్లో పాల్గొన్న ఎం.నాగదేవి, ఏ.యామిని దేవి జాతీయ పోటీలకు ఎంపికవ్వగా, యామినీ దేవి ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించింది. ఆ విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి అభినందించారు. గోవాలో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీలోనూ రింక్ 5 రోడ్డు రేస్ విభాగంలో నగరానికి చెందిన కొండి లలిత్ వర్మ బంగారు పతకం, రింక్ 6 విభాగంలో రజిత పతకం సాధించాడు.

శిక్షణతో మంచి ఫలితాలు

క్రీడల్లో నైపుణ్యం సాధించడానికి క్రీడాకారులకు శిక్షణ చాలా అవసరం. అప్పుడు వారు వివిధ పోటీలలో ప్రతిభ చూపగలుగుతారు. ఇందుకోసం ప్రతి ఏటా వేసవి క్రీడా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా మే ఒకటి నుంచి 31 వరకూ దాదాపు నెల రోజుల పాటు నగరంలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం, స్టేడియం, ఎస్‌కేవీటీ క్రీడా మైదానం, లాలాచెరువు పోలీస్ గ్రౌండ్స్ వంటి వాటిలో క్రికెట్, ఫుట్ బాల్, బాస్కెట్ బాల్, యోగా, కరాటే వంటి వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. స్కూల్ గేమ్స్, ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలను నిర్వహించి గ్రామీణా స్థాయిలో క్రీడాకారులను గుర్తించి మెరుగైన శిక్షణ ఇచ్చారు.

మెట్ట గ్రామాలలో జోరుగా దమ్ములు



బూరుగుపూడిలో పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు

మధురపూడి: కోరుకొండ మండలంలోని మెట్ట గ్రామాల్లో దమ్ములు జోరందుకున్నాయి. రైతులు తమ పొలాల్లో నాట్లు వేయడం కోసం మడులలో ట్రాక్టర్లతో దమ్ము చేయిస్తున్నారు. మధురపూడి, బూరుగుపూడి, గాడాల, నిడిగట్ల, దోసకాయలపల్లి, బొల్లెద్దులపాలెం, గరగలంపాలెం, కోటికేశవరం, కణుపూరు, గాదరాడ, నర్సాపురం గ్రామాల్లో ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని 22 వేల ఎకరాల్లో ఉద్యానవనాలు, వ్యవసాయ సాగుభూములు ఉన్నాయి. వాటిలోని దాదాపు 7,600 వరిని సాగు చేస్తున్నారు.